


# త్వరలో హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్

**వచ్చే జనవరి-మార్చిలో మార్కెట్‌లోకి • మరో మూడు ఈవీ మాడళ్లూ రాక**

న్యూఢిల్లీ, జూన్ 17: హ్యుందాయ్ మోటర్ ఇండియా.. విద్యుత్తు ఆధారిత వాహనాలపై (ఈవీ) దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ఆఖరు (వచ్చే ఏడాది జనవరి-మార్చి)కల్లా దేశీయ మార్కెట్‌కు 4 ఎలక్ట్రిక్ వెహికిల్ మాడళ్లను పరిచయం చేయాలనుకుంటున్నది. వీటిలో పాపులర్ క్రెటా మాడల్ కూడా ఉన్నది. ఈ మేరకు మార్కెట్ రెగ్యులేటర్ సెబీకి దాఖలు చేసిన పబ్లిక్ ఇష్యూ (ఐపీవో) పేపర్లలో హ్యుందాయ్ పేర్కొన్నది. అయితే ధర, ఎన్ని కిలోమీటర్లు ప్రయాణించగలదన్న వివరాలు తెలియరాలేదు. రూ.25,000 కోట్ల భారీ ఐపీవోతో దేశీయ స్టాక్ మార్కెట్లలోకి హ్యుందాయ్ ప్రవేశించాలనుకుంటున్న విషయం తెలిసిందే. కాగా, ప్రస్తుతం భారతీయ ఆటోమొబైల్ మార్కెట్‌లో ఈవీల సందడి ఎక్కువగా కనిపిస్తున్నది. పర్యావరణ సమస్యలు, ఇంధన ధరల నడుమ వినియోగదారులు సైతం ఈవీ కొనుగోళ్లకే మొగ్గు చూపుతున్నారు. ఇక టాటా మోటర్స్ మిగతా అన్నింటికంటే ఎక్కువ మాడళ్లతో మార్కెట్‌లో దూసుకుపోతున్నది. దీంతో ఈ పోటీలో ముందు నిలిచేందుకు హ్యుందాయ్ కూడా క్రెటాసహా మరికొన్ని ఈవీ మాడళ్లను తేవాలని నిర్ణయించుకున్నది. ఈ క్రమంలోనే భారత్‌లో సెల్స్, బ్యాటరీ ప్యాక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ తదితర విడిభాగాల ఉత్పత్తి దిశగా అడుగులు వేస్తున్నది. ఇప్పటికే అయోనిక్5, కోనా ఎలక్ట్రిక్ కార్లను హ్యుందాయ్ దేశీయంగా విక్రయిస్తున్నది విదితమే. రూ.45 లక్షలు, రూ.24 లక్షల శ్రేణిలో వీటి ధరలున్నాయి. ఇదిలావుంటే ఈవీ చార్జింగ్ స్టేషన్ల నిర్మాణంపైనా సంస్థ ఆసక్తి చూపుతున్నది. దేశవ్యాప్తంగా కంపెనీకి 11 చార్జింగ్ స్టేషన్లున్నాయి. జాతీయ రహదారులపై అన్ని నగరాల్లో మరిన్ని తేవాలని చూస్తున్నది.

# పోటెత్తిన పసిడి దిగుమతులు

- గత ఆర్థిక సంవత్సరం యూఏఈ నుంచి 210% పైకి
- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ప్రభావం

న్యూఢిల్లీ, జూన్ 17: గత ఆర్థిక సంవత్సరం (2023-24) యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నుంచి భారత్‌కు బంగారం, వెండి దిగుమతులు పోటెత్తాయి. గతంతో పోల్చితే ఏకంగా 210 శాతం ఎగిసి 10.7 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. యూఏఈతో భారత్ కున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందమే (ఎఫ్‌టీఏ) ఇందుకు కారణమని సోమవారం విడుదలైన గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) నివేదిక చెప్తున్నది. ఈ క్రమంలో యూఏఈతో ఉన్న ఎఫ్‌టీఏ నిబంధనల్ని సవరించాల్సిన అవసరం ఉన్నదని కూడా ఈ ఆర్థిక మేధో దిగ్గజం అభిప్రాయపడింది. ఇక భారత్-యూఏఈ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) కింద ఇస్తున్న కస్టమ్స్ సుంకాల రాయితీపై పునరాలోచనలు చేసుకోకపోతే ఇబ్బందులేనని కూడా హెచ్చరించడం గమనార్హం. ప్రస్తుతం సీఈపీఏ కింద యూఏఈ నుంచి దేశంలోకి ఎంతైనా వెండి దిగుమతి చేసుకోవచ్చు. సాధారణంగా వర్తించే కస్టమ్స్ సుంకం కూడా 7 శాతం తక్కువే. దీనివల్ల గత ఆర్థిక సంవత్సరం ఖజానాకు రూ.1,010 కోట్ల ఆదాయం దూరమైందని జీటీఆర్ఐ తెలిపింది. 160 టన్నుల పుత్తడి దిగుమతిపై సుంకాల్లో 1 శాతం రాయితీ వస్తున్నది. 2022 ఫిబ్రవరిలో సీఈపీఏపై ఇరు దేశాల సంతకాలు జరిగాయి. అదే ఏడాది మే నెల నుంచి ఒప్పందం అమల్లోకి వచ్చింది.

**స్మగ్లింగ్‌కు చెక్ పెట్టాలి**

అధిక దిగుమతి సుంకాలతో దేశంలోకి బంగారం, వెండి స్మగ్లింగ్ పెరుగుతున్నదని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాత్సవ అన్నారు. ప్రస్తుతం 15 శాతంగా సుంకం ఉన్నదని గుర్తుచేశారు. దీన్ని 5 శాతానికి తగ్గిస్తే స్మగ్లింగ్ పెద్ద ఎత్తున తగ్గుతుందని సూచించారు. కాగా, అంతకుముందుతో పోల్చితే గత ఆర్థిక సంవత్సరం భారత్‌లోకి యూఏఈ నుంచి జరిగిన మొత్తం దిగుమతులు 9.8 శాతం పడిపోయాయి. 2022-23లో 53.2 బిలియన్ డాలర్లుగా ఉంటే, 2023-24లో 48 బిలియన్ డాలర్లకే పరిమితమయ్యాయి. అయినప్పటికీ ఇదే సమయంలో బంగారం, వెండి దిగుమతులు 3.5 బిలియన్ డాలర్ల నుంచి 10.7 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఆభరణాల వాటా కూడా ఇందులో పెద్ద ఎత్తునే ఉన్నది.



## గిఫ్ట్ సిటీ సెగ

గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలోగల ఇండియా ఇంటర్నేషనల్ బులియన్ ఎక్స్ఛేంజ్ (ఐఐబీఎక్స్) ద్వారా కూడా యూఏఈ నుంచి పసిడి, వెండి దిగుమతులు చేసుకొనేలా ప్రైవేట్ సంస్థలకు మోదీ సర్కారు అవకాశం ఇచ్చింది. అంతకుముందు ఆథరైజ్డ్ ఏజెన్సీలకే ఈ వీలుండేది. ఫలితంగా దేశ వాణిజ్య లోటు పెరిగిపోతున్నది. దీంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సొంత రాష్ట్రంలోని గిఫ్ట్ సిటీ ఉన్నతికి తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయిప్పుడు.

## హైదరాబాద్‌కు జేబీపీ

ముంబై, జూన్ 17: వజ్రాల తయారీదారు జ్యువెల్స్ బై ప్రీతి (జేబీపీ) విస్తరణ బాట పట్టింది. ఇందులో భాగంగానే హైదరాబాద్‌తోపాటు ముంబై, ఢిల్లీ, బెంగళూరు, పుణె, చెన్నై, కోల్‌కతా, అహ్మదాబాద్‌ల్లో స్టోర్లను ఏర్పాటు చేయబోతున్నది. ఈ ఏడాది ఆఖరుకల్లా దేశవ్యాప్తంగా 15 స్టోర్లను తెస్తామని సోమవారం కంపెనీ వ్యవస్థాపకులు ప్రీతి జైన్ తెలిపారు.

## రిటైర్డ్ ఉద్యోగులకు ప్యాకేజీని పెంచాలి

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): అతి తక్కువ పెన్షన్‌తో రిటైర్డ్ బొగ్గు గని కార్మికులు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని, పెట్రోలియం కంపెనీల తరహాలో కోల్ ఇండియా, సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకూ ఆర్థిక ప్యాకేజీని వర్తింపజేయాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు సోమవారం సింగరేణి భవన్‌లో సింగరేణి గుర్తింపు సంఘం నాయకులతో విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసోసియేషన్ అధ్యక్షుడు డీ రామచందర్‌రావు వినతి పత్రాన్ని సమర్పించారు.



# తరాలు మారినా.. తరగని బంధం

## కలిసికట్టుగా రుయా సోదరులు

**దేశ, విదేశీ వ్యాపారాలను ఒక్కటై నడిపిస్తున్న ఉమ్మడి కుటుంబం**

*తల్లిదండ్రులు-బిడ్డల మధ్య వారసత్వ తగాదాలు.. అన్నదమ్ముల నడుమ ఆస్తుల గొడవలు.. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో ఉన్నాయి. అయితే ఈ తగువులకు దేశంలోని వ్యాపార కుటుంబాలూ అతీతం కాదు. ఇంకా చెప్పాలంటే వీళ్ల మధ్యే అధికం. అలాంటి ఘటనల్ని చూశాం.. చూస్తూనే ఉన్నాం కూడా. కానీ రుయా సోదరులు ఇందుకు మినహాయింపు. తరాలు మారినా తరగని బంధంతో కలిసికట్టుగా నడుస్తున్నారు మరి. దేశ, విదేశీ వ్యాపారాల నిర్వహణలో ఈ ఉమ్మడి కుటుంబం అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నది.*


తమ వారసులతో ఎస్సార్ గ్రూప్ వ్యవస్థాపక సోదరులు రవి రుయా, శశి రుయా

న్యూఢిల్లీ, జూన్ 17: వ్యాపారంపై పట్టు కోసం రోడ్డెక్కుతున్న వారసులను ఇటీవలి కాలంలో ఎందర్నో చూస్తున్నాం. తమ తాతలు, తండ్రుల సంపద కోసం కోర్టుల్లో ఏండ్ల తరబడి పోరాడుతున్నవారూ ఉన్నారు. అంబానీలు, హిందుజా సోదరులతోపాటు ఎస్కార్ట్స్, రేమాండ్స్, అపోలో టైర్స్, కేకే మోదీ కుటుంబ గొడవలు తెలిసిందే. కానీ ఎస్సార్ రుయా కుటుంబం మాత్రం తమదైన రీతిలో ఒక్కటై విజయాలను సాధిస్తున్నది. మెటల్స్ దగ్గర్నుంచి పోర్టులదాకా వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటూపోయిన శశి రుయా, రవి రుయాలకు.. వారి కుటుంబ సభ్యులే పెద్ద బలం. అవును.. వారి పిల్లలు, వాళ్ల పిల్లలు ఇలా మూడు తరాలు తరగని బంధంతో ఒక్కటై వెళ్తున్నారు. దేశ, విదేశాల్లోని వ్యాపారాలను ఉమ్మడిగా నిర్వహిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు.

**55 ఏండ్లపైనే..**

1969లో తొలి తరం రుయాలైన శశి, రవి రుయా సోదరులు ఎస్సార్ గ్రూప్‌ను స్థాపించారు. అప్పుడే మద్రాస్ పోర్ట్ ట్రస్టు నుంచి రూ.2.5 కోట్ల విలువైన మొదటి ఆర్డర్‌ను అందుకున్నారు. అప్పట్నుంచి క్రమేణా వ్యాపారాలను విస్తరించుకుంటూ పోయారు. నిజానికి తొలినాళ్లలో నిర్మాణ, ఇంజినీరింగ్ రంగాలపైనే రుయాలు దృష్టిపెట్టారు. కానీ 1980వ దశకంలో విద్యుత్తు, చమురు, గ్యాస్ రంగాల్లోకీ వచ్చారు. ఇక 1990ల్లో ఉక్కు, టెలికం రంగంల్లోకీ ప్రవేశించారు. అయితే వ్యాపార విస్తరణలో భాగంగా తీసుకున్న రుణాలు.. రుయాలను అప్పుల ఊబిలోకి నెట్టాయి. నిజానికి 2012లో ప్రపంచంలోనే అత్యంత భారతీయ ధనవంతులుగా రుయా సోదరులు 7 బిలియన్ డాలర్ల సంపదతో ఫోర్బ్స్ జాబితాలో నిలిచారు. అయితే పెరిగిన రుణ భారాన్ని దించుకునే క్రమంలో టెలికం సంస్థను, ఆయిల్ రిఫైనరీ, స్టీల్ ప్లాంట్లను అమ్ముకోవాల్సి వచ్చింది. ఇలా రూ.2 లక్షల కోట్లకుపైగా రుణాలను తగ్గించుకున్నారు. ఇప్పుడు ఎస్సార్ గ్రూప్ తిరిగి ఆవిష్కృతమవుతున్నది.

**అంతా ఒక్కచోటనే..**

ముంబై, ఢిల్లీ, లండన్‌లలో రుయా సోదరుల కుటుంబాలు దాదాపు 60 ఏండ్లుగా కలిసే జీవిస్తున్నాయి. కొడుకులు, మనుములు-మనుమరాండ్లు కుటుంబ వ్యాపారాలను ఒక్కటై చూసుకుంటున్నారు. ప్రస్తుతం ఎస్సార్ గ్రూప్.. ఎనర్జీ, మెటల్స్, మైనింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, లాజిస్టిక్స్, టెక్నాలజీ, రిటైల్ రంగాల్లో వ్యాపారాలను నిర్వహిస్తున్నది. 14 పోర్ట్‌ఫోలియో కంపెనీలున్నాయి. భారత్‌తోపాటు బ్రిటన్, వియత్నాంలలో ఆయిల్ రిఫైనరీ, పవర్ ప్లాంట్లున్నాయి. 35కుపైగా దేశాల్లో ఐటీ సొల్యూషన్స్‌ను అందిస్తున్నది. రెన్యువబుల్స్ ఎనర్జీలోకీ ప్రవేశించింది. గ్రూప్ రెవిన్యూ దాదాపు 15 బిలియన్ డాలర్లు. ఆస్తులు సుమారు 8 బిలియన్ డాలర్లపైనే.

> *కుటుంబ సభ్యులందరం కలిసే ఉంటాం. గ్రూప్‌లోని ఒక్కో వ్యాపార విభాగాన్ని ఒక్కొక్కరం చూసుకుంటాం. లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధన కోసం సమష్టిగా కృషి చేస్తాం. ఆలోచనల్ని, సంతోషాల్ని పంచుకుంటాం. సలహాల్ని ఇచ్చి పుచ్చుకుంటాం. కొత్త తరాలు వస్తున్నా.. మా ఈ బంధం బలపడుతూనే ఉండటం ఆనందంగా ఉన్నది. 12 ఏండ్ల వయస్సు నుంచే నేను సెలవు రోజుల్లో నాన్నతో కలిసి పనిచేయడం మొదలు పెట్టాను. కుటుంబంలోని పెద్దవారంతా తర్వాతి తరాలకు ఉమ్మడి కుటుంబం లాభాలను వివరిస్తూపోతున్నాం.*
>
> **-ప్రశాంత్ రుయా, శశి రుయా కుమారుడు**

# మారనున్న ఆదాయ పన్ను రేట్లు?




న్యూఢిల్లీ, జూన్ 17: వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ) రేట్లు మారనున్నట్టు తెలుస్తున్నది. వచ్చే నెలలో కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను పూర్తిస్థాయి బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టనున్నది. మధ్యతరగతి వేతన జీవులకు ఊరటనిచ్చేలా పన్ను రేట్లలో మార్పులు చేయవచ్చన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. మార్కెట్‌లో వినిమయ శక్తిని పెంపొందించాలన్న కోణంలోనూ దీన్ని మోదీ సర్కారు పరిశీలిస్తున్నట్టు సమాచారం. వార్షిక ఆదాయం రూ.10 లక్షల నుంచి 15 లక్షల మధ్య ఉన్నవారికి, ఆపై ఆదాయమున్న వర్గాలకు ఊరటనిచ్చేలా పన్ను రేట్లను తగ్గిస్తారన్న ఊహాగానాలున్నాయి.

# సింగరేణి ఐటీ విభాగానికి జాతీయ బహుమతి

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల సమాచారం, సేవలకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ)ని విస్తృతంగా వాడుతున్నందుకు సింగరేణి సంస్థ ఐటీ విభాగానికి జాతీయ అవార్డు దక్కింది. అత్యుత్తమ ఐటీ సేవలకుగాను కంప్యూటర్ ఎక్స్‌ప్రెస్ సంస్థ అందజేసే అవార్డును ఆదివారం రాత్రి రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి సమావేశంలో ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్ కేటగిరిలో సింగరేణికి ప్రదానం చేశారు. సోమవారం ఉదయం సింగరేణి భవన్‌లో కో-ఆర్డినేషన్ జీఎం జీ దేవేందర్, ఐటీ ప్రాజెక్ట్ మేనేజర్ హరప్రసాద్, ఐటీ డిప్యూటీ మేనేజర్లు హరిశంకర్, హరిప్రసాద్, మేనేజర్ రామ లక్ష్మయ్యలు ఈ పురస్కారాన్ని సింగరేణి సంస్థ సీఎండీ బలరాంకు అందజేశారు. అవార్డు లభించడం పట్ల ఆయన ఉద్యోగులను అభినందించారు.




ప్రమాదకరంగా మారిన గుంత

# ప్రమాదకరంగా కల్వర్టు


బోథ్, జూన్ 17 : ధన్నూర్(బీ) గ్రామ సమీపంలో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో కల్వర్టు వద్ద మట్టి కొట్టుకుపోయింది. అడెల్లి మార్గంలోని ఈ రూట్‌లో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన వద్ద కోతకు గురై పెద్ద గుంత ఏర్పడడంతో ప్రమాదాలు సంభవించే పరిస్థితి నెలకొన్నాయి. రోడ్డు, భవనాల శాఖాధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

# చిరుధాన్యాలపై అవగాహన


మాట్లాడుతున్న జేఏఎస్ వాలంటీర్ మధుకర్

ఇచ్చోడ(సిరికొండ), జూన్ 17 : సిరికొండ మండలంలోని రాజంపేట, లేండిగూడ గ్రామాల్లో సోమవారం చిరుధాన్యాలపై జీవన్ ఆధార్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిరుధాన్యాలు, వాటి ఉపయోగాలు, సహజ ఎరుగుదలతో పండించాలనే విషయాన్ని తెలిపారు. జేఏఎస్ వాలంటీర్ మధుకర్, రైతులు పాల్గొన్నారు.

# అదృశ్యం


అఖిల(ఫైల్)

నర్సాపూర్(జీ), జూన్ 17: నర్సాపూర్(జీ)కి చెందిన అఖిల ఆదివారం రాత్రి 9 గంటల నుంచి కనిపించక పోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించ లేదు. ఆమె తల్లి ఎల్లవ్వ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు ఎస్ఐ హన్మాండ్లు తెలిపారు.

# విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 17 : నిర్మల్ పట్టణంలో విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్‌లోని గొల్లపేట కాలనీకి చెందిన ప్రమోద్(31) పట్టణంలోని ఓ హోటల్‌లో పని చేస్తున్నాడు. ప్రమోద్ అద్దె ఇంటిలో ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం ఇంటి బయట ఉన్న సమయంలో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలు తగలడంతో షాక్ తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు వెంటనే పట్టణంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృ తి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# పచ్చిరొట్టతో ప్రయోజనాలు అధికం

- భూసారం పెంపుతో అధిక దిగుబడులు
- అందుబాటులో జీలుగ విత్తనాలు
- సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు


జీలుగ పంటపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు (ఫైల్)

ఖానాపూర్, జూన్ 16 : రైతులు పండించే పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు పచ్చరొట్ట అయిన జీలుగ విత్తనాలు ప్రయోజనకరంగా ఉంటాయని వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. 30 కిలోల బ్యాగు రూ. 1116 ధరకు రైతులకు వానకాలం పంటల సాగుకు ముందే పీఏసీఎస్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. పచ్చిరొట్ట ఎరువులతో భూమి సారవంతం అవుతుందని రైతులకు క్షేత్ర స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా వరి పొలాల్లో జీలుగ, జనుము, పెసర సాగు చేయడంతో భూమికి ఎంతో మేలు చేస్తుందని చెబుతున్నారు. నేల స్వభావాన్ని బట్టి జీలుగ సాగు చేసుకుంటే తర్వత వేసుకునే పంటలకు అనుకూలంగా ఉండి పంటకు సరిపడ పోషకాలు లభిస్తాయని తెలుపుతున్నారు.

**జీలుగు సాగు ఇలా...**

వరి పంట సాగుకు 30 నుంచి 45 రోజుల ముందు పంట పొలాల్లో పొడి దుక్కిలో జీలుగ విత్తనాలను వేదజల్లుకోవాలి. ఒక ఎకారనికి 12 కిలోల జీలుగ విత్తనాలు చల్లుకోవాలి. మొక్కలు బాగా పెరిగేందుకు క్రమపద్ధతిలో ఉండే విధంగా ఎకరాకు 30 కిలోల యూరియ వేసుకోవాలి. దీంతో ఎపుగా పెరిగి పూత దశకు వస్తుంది. 30 రోజుల తర్వత రోటావేటర్ లేదా కేజ్‌వీల్స్‌తో పొలంలో కలియదున్నాలి. దున్నిన ఎకరాకు 100 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్ చల్లాలి. సూపర్ పాస్ఫేట్ చల్లడంతో మొక్కల అవశేషలు బాగా కుల్లిపోయి పచ్చిరొట్ట మొక్కలు ఎరువుగా తయారవుతుంది. దీంతో పంటలకు కావాల్సిన పోషకాలు అధికంగా అందుతాయి. జీలుగ కుల్లే సమయం మడుల్లో నీటిని సక్రమంగా ఉంచాలి. ఈ ఫైర్లను కలియదున్నినప్పుడు నత్రజని సహజసిద్ధంగా భూమికి అందుతుంది.

**జీలుగతో పంటలకు అనేక ప్రయోజనాలు**

పొలంలో జీలుగ వేసి కలియ దున్నినట్లయితే పంటలకు విశేషమైన పోషకాలు అందుతాయి. ప్రధాన పంటలకు అనువుగా నేల స్వభవాన్ని తాయరు చేస్తుంది. మొక్కలకు నత్రజనితో పాటు సూపర్ పాస్ఫేట్‌ను అదనంగా అందిస్తుంది. జింక్ మాంగనీస్, ఐరన్, కాల్షియం లాంటి సూక్ష్మదాతువులను పంటకు అనుకూలంగా మార్చుతాయి. జీలుగ మొక్క వేర్లలో సేంద్రియ కార్బన్, నత్రజని, బాస్వరం, పోటాషియం స్థిరీకరణ అధికంగా ఉంటుంది కాబట్టి తుంగ, గరక వంటి కలుపు మొక్కలను నివారిస్తుంది.

**జీలుగ సాగుకు సరైన సమయం**



పొలాల్లో జీలుగ విత్తనాలు చల్లుకోవడానికి జూన్ నెల సరైన సమయం. తొలకరి వర్షాలకు చల్లుకుంటే వరి నాట్లు వేసే నాటికి దుక్కిలో కలియదున్నడానికి అనువుగా ఉంటుంది. రైతులకు కావాల్సిన జీలుగ విత్తనాలు ఖానాపూర్ పీఏసీఎస్ అధ్వర్యంలో అందుబాటులో ఉన్నాయి. 30 కిలోల బ్యాగు ధర రూ. 1116 ఉంది. కావాల్సిన రైతులు పట్టాపాస్‌బుక్ జిరాక్స్ కాపీతో వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలి. రైతులు పండించే పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి.

**-ఆసం రవి, ఏవో, ఖానాపూర్**

# వానకాలం సాగు పనుల్లో రైతులు

- పెరగనున్న పత్తి సాగు విస్తీర్ణం
- వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులు


పనుల్లో నిమగ్నమైన రైతులు

జైనథ్, జూన్ 17 : జైనథ్ మండలంలోని గ్రామాల్లో రైతులు వానకాలం పంట సాగు పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు. ఆయా గ్రామాల్లో రైతులు కూలీలు తమ పంట పొలాలను పూర్తిగా చదును చేశారు. గతేడాది కంటే ఈ సారి వర్షాలు కురవకపోవడంతో రైతులు నిరాశతో ఉన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది సోయా పంట కంటే పత్తి పంట సాగు విస్తీర్ణం పెరగనుంది. గతేడాది పత్తి పంటకు క్వింటాల్‌కు రూ.7200 ఉండగా సోయా పంట క్వింటాల్‌కు రూ.4600 ఉంది. దీంతో సోయా పంట కంటే ఈసారి పత్తి పంట సాగు విస్తీర్ణంలో రైతులు సన్నద్ధమవుతున్నారు. దీంతో పాటు ఆయా గ్రామాల రై తులు తమ పంట పొలాల్లో విత్తుకోవడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేసుకున్నారు. కొంత మంది రైతులు తేలికపాటి చిరు జల్లులకు విత్తనాలు విత్తుకొని మళ్లీ వర్షాలు రాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. వర్షాలు కురువాలని ఆయా గ్రామాల దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఏ గ్రా మంలో చూసిన వర్షాలు ఎప్పుడు కురుస్తాయోనని రైతుల్లో చర్చనీయాంశంగా మారింది.

# 2వ బెటాలియన్‌కు ఐపీఎస్ అధికారి నితిక పంత్


నితిక పంత్

ఎదులాపురం, జూన్ 17 : ఆదిలాబాద్ జిల్లా యాపల్‌గూడ 2వ బెటాలియన్ కమాండెంట్‌గా నితిక పంత్ నియమిస్తున్నట్లు ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసింది. నితిక పంత్ ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా సతీమణి. ఇక్కడ పని చేసిన చటర్జీని డీజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు. 2017 బ్యాచ్‌కు చెందిన నితిక పంత్ టా స్క్ ఫో ర్స్ డీసీపీగా పని చేశారు. పోలీసు శాఖలో టాస్క్ ఫోర్స్‌కీలకం ఇంతటి కీలకమైన టాస్క్‌ఫోర్స్‌కు డీసీపీగా నితిక పంత్ నియామకం కావడం తొలిసారి.

# బాదిలో అటవీ అధికారులతో రైతుల వాగ్వాదం


అటవీ శాఖ అధికారులతో వాగ్వాదానికి దిగిన రైతులు

- పోడు సాగును అడ్డుకున్న అటవీ శాఖ అధికారులు
- పురుగుల మందు డబ్బా తో రైతుల నిరసన

జైనథ్(బేల), జూన్ 17: ఆదిలాబాద్ జిల్లా బేల మండలం బాది అటవీ బీట్‌లో పోడు సాగు చేస్తున్న రైతులను సోమవారం అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. రైతులు సాగు చేస్తున్న పోడు భూముల్లో కందకాలు తవ్వి చెట్లను పెంచడానికి అటవీ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తుండడంతో అడ్డకునే ప్రయ త్నం చేశారు. 20 సంవత్సరాల నుంచి పోడు భూములను సాగు చేయనివ్వకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా పోడు భూములను సాగు చేస్తున్నామని పేర్కొన్నారు. అటవీ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తూ భూములు లాక్కోవడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇక్కడున్న రైతులకు కనీసం ఒక గుంట భూమి కూడా లేదని ఉన్న పోడు భూములను అటవీ అధికారులు లాక్కుంటే బతకడం కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న భూములను అటవీ అధికారులు లాక్కుంటే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఫారెస్ట్ అధికారుల వేధింపుల నుంచి తమను కాపాడి తమకు తగు న్యాయం చేయాలని కోరారు.

# కూచిపూడి నృత్యంలో నిర్మల్ వాసుల ప్రతిభ


అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్న నిర్మల్ వాసులు

నిర్మల్ అర్బన్, జూన్ 17: హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో నిర్మల్‌కు చెందిన 25మంది కళాకారులు పాల్గొని ప్రతిభ కనబర్చడంతో జయహో తెలంగాణ అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. వీరిని నృత్య శిక్షకురాలు నవ్య, పట్టణ వాసులు అభినందించారు.